# కీర్తి కండూతి

మంగతాయారుకి మొదట్నుండి కీర్తి కాంక్ష మెండు. కాస్త బుద్ధి తెలిసిన దగ్గరనుండీ పదిమందిలోనూ తను ప్రత్యేకంగా కనపడాలనీ, అందరూ తనను గురించే చెప్పుకోవాలనీ తహతహలాడేది.

క్లాసులో కాస్త చురుకుగా ఉండటంవల్ల ఉపాధ్యాయులంతా ఆమెను ముఖ్యంగా ఆడపిల్ల అనేదృష్టితో అభిమానంగా చూసేవాళ్లు. దాంతో తమతోటి క్లాసులోని పిల్లలందరికంటె గొప్పదానినన్న అభిప్రాయం ఒకటి ఆమెకు ఏర్పడిపోయింది.

ఆమెలో అందం, ఆకర్షణ అంతంత మాత్రంగానే ఉన్నాయి. అది ఆమెకు చాలా బాధ కలిగించేది. తనకున్న తెలివితేటలకు తోడు అందం కూడా ఉంటే ప్రపంచాన్నే జయించగలిగి ఉండేదికదా అనివిచారించేది.

'ఇప్పుడు మాత్రం ఏం పోయిందిలే ? ఏదో రకంగా తోటి ఆడవాళ్ళకంటె ప్రత్యేకంగా, ఉన్నంతగా ఉండటానికి ప్రయత్నిస్తాను.' అని తనలో తాను సరిపెట్టుకునేది. అందరు పరికిణీలు, జాకెట్లు తొడుక్కునే వయస్సులో తను గౌన్లువేసుకునేది. అందరూ రెండు జడలు ఫ్యాషన్ అనుకుని వేసుకుంటే తను ఒక్క జడే రెండు పాయలల్లి మిగతా జుట్టుని వదిలేసేది.

ఆడపిల్లలు మోచేతివరకు చేతులున్న జాకెట్లు తొడిగే సమయంలో తను పొట్టి చేతులు జాకెట్లు తొడిగేది. వీళ్ళ జాకెట్టు చేతులు పైకి పోతున్నకొలదీ మంగతాయారు జాకెట్టు చేతులు క్రిందికి దిగసాగేవి. అందరూ తిలకం పెట్టుకునే రోజుల్లో మంగ కుంకుమబొట్టు పెట్టుకునేది. మిగతా ఆడవాళ్ళు కుంకుమ ఫ్యాషనై పోయిందనుకుంటున్న రోజుల్లో ఆమె తిలకం పెట్టుకోవటం ప్రారంభించింది.

ఇలా ఏదో ఒక రకంగా తన చుట్టూ ఉన్న మనషులకంటె తను ప్రత్యేకంగా కనపడటానికి ప్రయత్నించేది మంగ. ఆఖరికి ఆడవాళ్ళందరిలాగా చీరలు కట్టుకుంటానికి కూడా నామోషీగా అనిపించేది మంగకు. తను తెలుగు దేశంలోని ఒక చిన్న టౌనులో పుట్టి పెరగబట్టే ఖర్మకొద్ది అందరాడవాళ్ళలా చీరలు కట్టుకోవాల్సి వస్తోందిగాని ఏ ఉత్తరదేశంలోనో పుట్టి ఉంటె కుర్తా, పైజమాలు, లుంగీ షర్టులు వేసు

కునేది కదా. ఏ మళయాళ దేశంలోనో పుట్టి ఉంటే లంగా జాకెట్టు మీదనే స్వేచ్ఛగా రోడ్లమీద తిరగ గలిగేది కదా యిలా పోతూండేవి మంగ ఆలోచనలు.

తన ప్రత్యేకతకు ఈ సంఘంలో గుర్తింపు ఉండటం లేదని, యీ భారతదేశంలో తనలాంటి అసాధారణ మేదస్సు గల స్త్రీలకు అనువైనది కాదనీ ఎప్పుడూ విచారిస్తూండేది ఆ విచారం యింతింత్తై ఆమె మనశ్శాంతికి దూరంకాసాగింది.

తనలో రేగే అలజడిని బహిర్గతం చెయ్యటానికి ఒక మార్గం కావలసి వచ్చింది మంగకు.

ఇటీవల ఆడ రచయిత్రుల రచనలకు పత్రికలలోగిరాకీ బాగా ఉన్నట్లు సూక్ష్మగ్రాహి అయిన మంగ యిట్టే గమనించేసింది. కీర్తి శిఖరాలను చేరుకోవటానికి దగ్గరదారి పత్రికల్లో ఒక వ్యాసమో, కథో అచ్చు కావటమేనని ఆమె గ్రహించిన మరుక్షణమే రచయిత్రిని కావాలన్న కోరిక ఆమెలో బలంగా నాటుకుపోయింది,

తను వ్రాసే మొదటి రచనతోనే తెలుగు పాఠక లోకాన్నంతటినీ ఒక ఊపు ఊపెయ్యాలనుకుంది మంగ.

మొదటి కథ వ్రాద్దామనుకుంది.

కాని వెంటనే 'ఈ రోజుల్లో అందరూ కథలే వ్రాస్తున్నారు. నేను కూడా కథ వ్రాస్తే అందులో నా గొప్పేముంది?' అనుకుంది.

కాబట్టి గొప్ప సంచలనాన్ని రేకెత్తించే వ్యాసం ఒకటి వ్రాయాలని నిశ్చయించుకుంది మంగ.

అలా అనుకుంటున్న సమయంలోనే కొత్తగా మహిళల కోసం ప్రత్యేకమైన పత్రిక వెలువడుతోందన్న వార్త కూడా తెలిసింది మంగకు.

మహిళల పత్రికలంటే వంటా, వార్పూ, కుట్లు, అల్లికలు, ముగ్గులు, ముచ్చట్లు యివేగా ఉండేది. అలాంటి పత్రికలో మహిళ లెవ్వరూ వ్రాయని–వ్రాయలేని విధంగా తనొక వ్యాసం వ్రాయాలనుకుంది. పైగా యీ మధ్య ప్రతి విషయాన్నీ ప్రగతి కాముకులైన రచయితలు మార్కిస్టు దృక్పథంతో చూసి వ్రాస్తున్నారు కదా, కాబట్టి తను కూడా 'వంటా పెంటా ఒకు మార్కిస్టు పరిశీలన' అనే శీర్షికతో వ్యాసం వ్రాసింది మంగ.

ప్రథమ సంచికలో అచ్చయిన ఆ వ్యాసం మహిళలనే కాక ఎంతో మంది పురుషులను కూడా విపరీతంగా ఆకర్షించింది.

ఆ వ్యాసాన్ని వ్యాస రచయిత్రినీ పొగుడుతూ రెండవ సంచిక నుండి ఉత్తరాలు ధారావాహికంగా వెలువడ సాగినయ్.

'వంటా–పెంటావంటి అతి సామాన్యమైన విషయాన్ని కూడా మార్కిస్టు దృక్పథంతో వ్రాయగలిగిన రచయిత్రి

మంగతాయారు నిజంగా అభినందనీయురాలు. ఇకనుండి మీ (మా) పత్రికలో అలాటి వ్యాసాలనే ప్రచురించాలి' అంటూ పాఠకులు పత్రిక మీద, రచయిత్రి మీద తమకు గల అభిమానాన్ని ప్రకటించేరు.

వంట, పెంటలను చారిత్రిక దృక్పథంతో పరిశీలించి అవి కాలక్రమంలో ఎన్ని మార్పులు చెందినవో, ఎందరి చేతులు మారినవో ఎంతో ఓపికగా స్టడీ చేసి వ్రాసిన ఆ వ్యాసానికి నిజంగా యూనివర్సిటీ వారు మీకు ఆనరరీ డాక్టరేట్ ఇచ్చితీరాలి. ఐనా మన ఇండియన్ యూనివర్శిటీ అధికారులకు అంత విశాల హృదయా లెక్కడివి ? మీలాటి రచయిత్రులు ఇండియాలో కన్నా విదేశాలలో ఉంటే బాగా రాణిస్తారు. ఇక మీ దురదృష్టమైన వంటి ప్రతిభావంతురాలైన రచయిత్రి మా దేశంలో పుట్టటం మా అదృష్టమనే భావిస్తున్నాము' అంటూ కొందరు పాఠకులు మరి కొంత ముందుకు పోయేరు.

ఐతే ఆ వ్యాసాన్ని విమర్శిస్తూ కూడా కొన్ని ఉత్తరాలు రాకపోలేదు. 'వంటా—పెంటా' అని మీరు పెట్టిన టైటిల్‌లోనే పెద్ద లోపం ఉంది. ఇలా జంటపదాలను వాడేటప్పుడు సన్నిహితార్థాన్ని స్ఫురింప జేసే రెండు పదాలను గాని (ఉదా॥ ఇల్లూ వాకిలీ) లేదా పరస్పర విరుద్ధమైన భావాలు గల పదాలనుగాని (ఉదా॥ మంచి—చెడూ) వాడ

వలెను. అంతేగాని ఏమాత్రం ఒక దానితో సంబంధంలేని వంట, పెంట అనే రెండు పదాలను జంటగా వాడటం సమంజసంగా లేదు. ఇలాటి శాస్త్రీయ విషయాలను గురించి చర్చించేటప్పుడు పదాలను యిష్టం వచ్చినట్లు వాడెయ్యకూడదు అంటూ కొందరు ఇంట లెక్చుయల్స్ అయిన పాఠకులు మంగతాయారును కోప్పడ్డారు. 'వంటా–పెంటా' అనేకంటే 'వంటా–వార్పూ' అన్న టైటిల్ పెడితే సమంజసంగా ఉండేది అంటూ సూచించిందొక ఉత్తరాల రచయిత్రి.

ఆ ఉత్తరం అచ్చయిన మరుసటి వారంకల్లా మరో ఉత్తరాల రచయిత్రి 'ఇవి ప్రెషర్ కుక్కర్ల రోజులు. అన్నం వార్చటం అనేది పాతపద్ధతి. అలాంటి బూజు పట్టిన పదాలను యీ రోజుల్లో వాడటం అభ్యుదయకరం కాదు. కనుక 'వార్పు' అన్న పదాన్ని విత్ డ్రా చేసుకోవలసింది' అంటూ ఘాటుగా వ్రాసింది.

ఎలాగయితేనేం మంగతాయారు కోరుకున్నట్టుగానే ఆ మహిళల పత్రికలో ఆర్నెల్లపాటు 'వంటా-పెంటా' వ్యాసం మీద ఉత్తరాల శీర్షిక ద్వారా వాదోపవాదాలు రేగడంతో ఆ పత్రికకు, మంగకు కూడా ఒక్కసారిగా విపరీతమైన పేరు ప్రతిష్టలు వచ్చేసినయ్.

ఆ ఉత్సాహంతో 'స్త్రీలే సంతానోత్పత్తిని ఎందుకు చెయ్యాలి?' అన్న శీర్షికతో మార్క్సిస్టు భావాలకు సైంటి

ఫిక్ ఫాక్ట్సు కూడా జోడించి మరో వ్యాసం వ్రాసి ఆ మహిళల పత్రికకే పంపించింది మంగతాయారు. స్త్రీ శారీరకంగా పురుషునికన్న దుర్భలురాలు గనుక పురుషులే సంతానోత్పత్తిని చెయ్యటం న్యాయమని, హార్టు ట్రిప్టింగ్, లంగ్ గ్రాప్టింగ్ వగైరా అద్భుతమైన విషయాలను కనుక్కుంటున్న యీ స్పుత్నిక్ యుగంలో ప్రయత్నిస్తే పురుషులను సంతానోత్పత్తికి అనుకూలంగా మార్చటం ఏమంత కష్టమైన పని కాకపోవచ్చుననీ, యీ మహిళా సంవత్సరంలోనైనా వైద్య శాస్త్ర నిపుణులు యీ విషయాన్ని గురించి ఆలోచిస్తారని, ఆశిస్తున్నాననీచెప్తూ వ్యాసాన్ని ముగించింది మంగతాయారు.

ఆ వ్యాసం చదివి బుగ్గలు నొక్కుకున్నవారు, నవ్వుకున్నవారు, నొసటితో వెక్కిరించినవారు ఎంతమంది వున్నా 'అహా! ఎంత చక్కని సైంటిఫిక్ వ్యాసం వ్రాసింది!' అంటూ మెచ్చుకున్న పాటకులుకూడా లేకపోలేదు.

మంగతాయారుకు కావలసిందల్లా మంచిగానో చెడుగానో పదిమంది నోళ్ళలో తనపేరు తిరగటమే! అందుకే తన రెండవ వ్యాసానికి వచ్చిన 'రెస్పాన్స్'ని చూసి మహామురిసిపోయింది. కలం చేతబట్టి రచయిత్రి అవటంతో, తను ఎంత గొప్ప పని చేసిందోనని తనలో తానే అబ్బురపడింది.

పాఠకులు, పత్రికలు, యిచ్చిన ప్రోత్సాహంతో, తనకు తానై ఏర్పరచుకున్న కాన్ఫిడెన్సుతోసరికొత్తపంథాలో

వ్యాసాలూ, కథలు వ్రాయటం ప్రారంభించింది మంగతాయరు.

కిలోల కొద్దీ నవలలు వ్రాస్తే తప్ప పేరురావటం కష్టమైపోతున్న యీ రోజుల్లో 'ఓవర్ నైట్'న పేరు తెచ్చుకోవాలంటే పాఠకులను 'షాక్' చేసే అంశాలను గురించి వ్రాయటమే ఏకైక మార్గమని గ్రహించి మంగతాయారు అనేక నెలలుపాటు కష్టపడి ఆలోచించి ఏదో ఒక విచిత్రమైన రచనను పాఠకులమీదకు విసిరేసేది. ఆమె ఆలోచించినట్లుగానే ఆ రచనలు పాఠకులలో కల్లోలాన్ని రేపేసి రచయిత్రిని అభినందిస్తూ ఎన్ని ఉత్తరాలు వచ్చేవో రచయిత్రిని, ఆమె రచనలు అచ్చువేసిన పత్రికను కూడా దుమ్మెత్తిపోస్తూ వ్రాసే ఉత్తరాలుకూడా అన్ని వచ్చేవి.

వాటన్నిటినీ చదువుకుని తృప్తిగా నవ్వుకునేది మంగ. ఇందిరాగాంధి పేరుకూడా ప్రజలన్నిసార్లు గుర్తుంచుకోరేమో అనీ ఊహించుకొని గర్వపడేది.

ఆమె పేరు ప్రతిష్టలు విని దిమ్మతిరిగి పోయి వాళ్ళ బంధువులబ్బాయి ఏరి, కోరి కట్నం లేకుండా మంగతాయారును పెళ్ళి చేసుకొంటానని ముందుకు వచ్చేడు.

దాంతో మంగతాయారు అతిశయం మరింత పెరిగింది. పెళ్ళయిన మర్నాటినుండి మొగుడిమీద పెత్తనం చలాయించ సాగింది.

"నాలాటి గొప్ప రచయిత్రి భర్తం అవట నీ అదృష్టం" అంది. అలా అతను నమ్మేదాకా ఊరుకోలేదు.

"నేను నీకంటె తెలివిగల దానిని గనుక నేను చెప్పినట్లల్లా నువువిన్నాలి" అంది.

"సరే" ననక తప్పలేదతనికి.

"నువ్వు 'మొగవాణ్ణి కదా, మొగుడివి' అంటూ అధికారం చెలాయించాలనుకుంటున్నావేమో, జాగ్రత్త! నాదగ్గర అలాటివి చెల్లవు" అంది.

భర్తకి నీరసం వచ్చింది. గుండెదడ ప్రారంభమయింది "చిన్నప్పుడు మీ అమ్మమ్మ, నాయనమ్మ చెప్పిన పతివ్రతల కదలన్నీ మర్చిపోయావా? భర్తని దైవంగా కొలవాలని తెలియదా?" అంటూ దీనంగా అడిగాడు.

దాంతో ఛర్రుమంటూ లేచింది మంగతాయారు.

"సీత, సావిత్రీ, అనసూయ వీళ్ళంతా పతివ్రతలు కాదు. వాళ్ళు మామూలు ఆడవాళ్ళే. వాళ్ళలోనూ రక్త మాంసాలు, కోరికలు, కోపతాపాలు ఉండే ఉంటాయ్. వాళ్ళూ మొగుళ్ళను సాధించే వాళ్ళేనేమో! కాని మీ మగవాళ్ళంతా చేరి వాళ్ళను 'పతివ్రతలు' అనే బిరుదులిచ్చి వాళ్ళను అతి మంచివాళ్ళుగా చిత్రించి మాలాటి ఆడవాళ్ళను మోసం చేస్తున్నారు." అంటూ ఉద్రేకంగా మాట్లాడింది మంగతాయారు.

ఆమె మాటతీరు, ముఖకవళికలు అదీ చూస్తూంటే అతనికి తాటకి శూర్పణఖ మొదలైన స్త్రీలు గుర్తుకు వచ్చేరు.

అసలే మంగ అందం అంతంత మాత్రం. దానికితోడు కోపం వస్తే మరింత అందహీనంగా, వంకరగా ఉంటుంది ఆమె ముఖం.

కోపంలో ఉన్న భర్త ఆ మాట ఆమె ముఖంమీదనే అన్నాడు. "నువ్వు 'పతివ్రత' సంగతటుంచి అసలు మామూలు ఆడదానివే కాదు. రాక్షసివి. శూర్పణఖవి, తాటకవి" అన్నాడు. దాంతో యింకా రెచ్చిపోయింది మంగ.

"నన్ను శూర్పణఖ, తాటకి అంటున్నారు కదూ? చూడండి ఆ శూర్పణఖని . తాటకినే మహా స్త్రీలుగా, సౌందర్యవతులుగా చిత్రిస్తాను. మీరందరూ చొంగ కార్చుకుంటూ పొగిడే ఆ పతివ్రతా శిరోమణులందరినీ పతితలుగా, వక్రబుద్ధి గల వారుగా చిత్రిస్తూ రచనలు చేస్తాను. నేనెవరో తెలుసా? రచయిత్రిని. నా కలం బలంతో మీ నమ్మకాలన్నిటినీ వమ్ము చేసే సాహిత్యాన్ని సృష్టిస్తాను" అంటూ సవాల్ చేసింది.

అన్నట్లుగానే మంగతాయారు పాత పురాణాలన్నిటినీ తిరగవేసి పతివ్రతలుగా చెలామణి అవుతున్న స్త్రీలందరికీ పవిత్రంగా ఉండటానికన్న, చెడిపోవటానికే అవకాశాలు ఎక్కువ ఉన్నవనీ, ఎలా ఉండటానికి అవకాశం ఉందో అలా

ఉన్నట్లు వ్రాయడమే వాస్తవికత అని అలాటి వాస్తవికతను కప్పిపుచ్చే సాహిత్యం చెత్త అనీ నిరూపించటానికి ప్రయత్నించింది.

రావణుడు సీత నెత్తుకువచ్చి అశోకవనంలో అన్నాళ్లూ ఏమీ చేయకుండా వదిలిపెట్టేడంటే నమ్మశక్యం కాదుఅన్నది. అహల్య జపతపాలలో మునిగి తనని నిర్లక్ష్యం చేసే భర్తవల్ల కోరికలు తీరక ఇంద్రుడిని మోహించి అతని పొందు కోరినట్లు ఒక కథ వ్రాసింది.

తాటకి చాలా అందగత్తె అనీ ఆమె అందం చూసి రాముడు ఎక్కడ మోహిస్తాడోనని భయపడి, అసూయపడి రహస్యంగా తన మరిది లక్ష్మణునితో సంప్రదించి తాటకి ముక్కు, చెవులు కోయించి సీత తన ఈర్ష్యను చల్లార్చుకున్నట్లు మరో కథ నల్లింది.

ఆ కథలు అచ్చయిన వార పత్రికలన్నీ హాట్ కేకుస్లా అమ్ముడు పోసాగినయ్.

"ఇంకా యిలాంటి కథలనే వ్రాసి మా పత్రికలను నిలబెట్టండి" అంటూ ఎడిటర్లు ఆమెకు ఉత్తరాలు వ్రాయసాగేరు.

మంగ గర్వంతో పొంగిపోయింది.

"చూసేరా నా తడాఖా?" అంది భర్తతో.

నిజంగానే ఆమె భర్త ఆమె తడాఖా చూసి బెదిరిపోయేడు.

కళ్ళు వాచి, ఎర్రబడి, కళ్ళజబ్బు వచ్చేదాకా పురాణ గ్రంథాలన్నింటినీ వల్లించి వాటిని తిరగరాసి తన కీర్తి ప్రతిష్టలను పెంపొందించు కోటానికి రాత్రింబవళ్ళు శ్రమించసాగింది మంగతాయారు.

ద్రౌపదికి ఐదుగురు భర్తలు సరిపోక దుర్యోధనుడిని మోహించిందనీ — అదే భారత యుద్ధానికి కారణం అయి వుండవచ్చనీ, సాధికారంగా వ్రాసింది ఓ కథలో మంగ.

ఆ రాతలన్నీ చూసిన మంగభర్తకి మతిపోయినట్లయింది.

దానికి తగ్గట్లు అతని స్నేహితులు, బంధువులు "వ్రాయటానికి దానికి, అచ్చువేయటానికి పత్రికల వాళ్ళకీ బుద్ధి లేకపోతే – తాళికట్టిన మొగుడివి నీకన్నా బుద్ధుండక్కర్లా? పెళ్ళాం రాతలను అదుపులో ఉంచలేనివాడివి - నువ్వా ఒక మొగాడివే" అంటూ చీవాట్లు పెట్టేరు.

దాంతో మంగ భర్తకు పౌరుషం వచ్చింది.

ఇంటికి రయ్యిన పోతూనే మంగను ఆచెంపా ఈచెంపా వాయించేడు.

అతనలా కొడతాడనీ కొట్టగలడనీ ముందుగా తెలిసి ఉంటే మంగ కూడా తిరగబడి భర్తను కొట్టేదే! మంగ పర్సనాలిటీ ముందు భర్త పిచ్చికలాగా ఉంటాడు.

కాని అలాటి సంఘటనకు సిద్ధంగా లేకపోవటంవల్ల అప్రతిభురాలై పోయి నిల్చుంది మంగ.

"ఇహనించి యిలాంటి రాతలు వ్రాసేవంటే వళ్ళు చీరేస్తా" అన్నాడు.

"ఐతే తప్పకుండా అలాంటి వ్రాతలే వ్రాస్తాను. ఈ సారి మహిళల ప్రత్యేక సంచికకు వ్రాసే కథలో సుమతికి ఒక ప్రియుడున్నాడనీ, ఆ ప్రియుడితో గడపటానికి కుష్టు భర్త న్యూసెన్సుగా ఉండటం వల్ల భర్తని రోజూ బండిమీద తోసుకుంటూ పోయి వేశ్యాగృహం దగ్గర వదలిపెట్టి వచ్చేదనీ వ్రాస్తాను. ఏం చేస్తావో నువ్వు చూస్తాను." అంది హూంకరిస్తూ.

"అందరూ ఏమంటున్నారో తెలుసా? భార్యని అదుపులో పెట్టలేని నేను మగాణ్ణే కాదట!"

"ఆ సంగతి వాళ్ళంతా చాలా ఆలస్యంగా గ్రహించేరు. వాళ్ళకన్నా మీ సంగతి నాకు ముందుగానే తెలుసు." నిర్లక్ష్యంగా అన్నది మంగ.

మరోసారి కొట్టబోయేడు భర్త. కాని ఆమె బలంగా ఒక తోపు తొయ్యటంలో అవతల పడి తొంటి నొప్పి తెచ్చుకున్నాడు. ఆరోజుకింక ఆమె జోలికి పోలేదు భర్త.

మామూలుగా ఉన్నప్పుడు మంగను కొట్టే శక్తి తనకి లేదని గ్రహించిన భర్త తాగుడు అలవాటు చేసుకున్నాడు. ఆమెమీద కోపం వచ్చినప్పుడల్లా తప్పతాగి కసిదీరా కొట్టేవాడు మంగను.

తెల్లవారిన తరువాత ఆమె వంటిమీద గాయాలను చూసి తృప్తిగా, కసిగా నవ్వుకునేవాడు.

వళ్ళు నొప్పులు తగ్గిన తరువాత ద్విగుణీకృతమైన పౌరుషంతో కథలు వ్రాయసాగింది మంగ. "ఓ స్త్రీ లేచిపో"

అనీ "వివాహ వ్యవస్థ నశించాలి" అనీ యిలాంటి శీర్షికలతో కథలు, వ్యాసాలు వ్రాయటం మొదలుపెట్టింది.

వివాహ వ్యవస్థ స్త్రీని బానిసగా చేస్తుందని, పురుషుడు స్త్రీని తన 'సొంతం'గా ఎప్పుడు భావిస్తాడో అప్పుడు అతనిలో అహంకారం, స్వార్థం, అధికారం, క్రౌర్యం మొదలైన లక్షణా లన్నీ ఏర్పడతాయనీ కనుక స్త్రీలు స్వేచ్ఛగా జీవించాలంటే పురుషుడి చేత గౌరవింపబడాలంటే - ఒంటరిగా, స్త్రీగా, వ్యక్తిగా బ్రతుకుతూ యిష్టం వచ్చిన మగవాళ్ళతో స్నేహం చేస్తూండాలనీ అప్పుడే ఆమెకు సమాజంలో పురుషుడితో పాటు సమానంగా గౌరవం గుర్తింపు ఉంటాయనీ - యిలాటి అభిప్రాయాలను వెల్లడిచేసే కథలు వ్రాయటం మొదలు పెట్టింది మంగతాయారు.

తిట్టి కొట్టి ఆమెను దారిలోకి తీసుకురాలేకపోయిన భర్త అమెకు కోర్టుద్వారా విడాకులిచ్చి అమెను వదిలించుకున్నాడు.

కాని అందుకు మంగ ఏమాత్రం బాధపడలేదు పైగా భర్తకి విడాకులిచ్చి తాను భారత స్త్రీజాతి చరిత్రలోనే ఒక నూతనాధ్యాయాన్ని సృష్టించేనని గర్వపడ సాగింది. భర్తవల్ల మోజుతీరక లేచిపోయిన ఆడవాళ్ళు, క్రూరుడైన భర్తవల్ల దెబ్బలు తినలేక యింట్లోంచి పారిపోయిన స్త్రీలు అనాదిగా ప్రతి ఊళ్లోనూ తరచుగా ఉంటూనే ఉన్నారు.

వాళ్ళు విడిపోవటానికి కారకులైన భార్యనో, భర్తనో కోప్పడటం. అసహ్యించుకోవటం, ఆ సంగతి కొన్నాళ్ళకు మర్చిపోవటం అందరికీ మామూలే!

కాని మంగ అలా అనుకోదు తను అందరు స్త్రీల వంటిది కాదని, తను అసాధారణమైన స్త్రీ కాబట్టి భరని విడిచిపెట్ట గలిగిందని - తనలోని యీ గొప్పతనాన్ని స్త్రీ జాతి ఉద్ధరణకోసం తను చేసిన యీ త్యాగాన్ని ప్రజలు గుర్తించాలనీ తహ తహ లాడ సాగింది.

కాని ఆమె గొప్పతనాన్ని గుర్తించేంత గొప్పతనం ప్రజలలో లేదు.

ఆమెకు సన్నిహితులైన వాళ్ళంతా చేజేతులా సంసారాన్ని పాడుచేసుకున్నందుకు ఆమెను అసహ్యించుకోసాగేరు.

క్రమంగా పాఠకులకు కూడా ఆమె రచనలలోని 'వెలితి' అర్థం అవసాగింది.

తను స్వయంగా నమ్మి, పదిమందికీ ఉపయోగపడతా యనుకున్న నిజాలను తియ్యగా ఉన్నా, చేదుగా ఉన్నా రచయిత చెప్తే పాఠకులు సంతోషిస్తారు. అతని రచనలలోని నిజానిజాలను పరిశీలించటానికి ప్రయత్నిస్తారు.

కాని కేవలం ప్రజలలో క్షణికమైన ఆవేశాన్ని, చవక బారు ఉత్సుకతను కలిగించే రచనలు ఆదిలో ప్రజల నాకర్షించ గలిగినా — వాటిలో అర్థం కన్న అర్భాటమే ఎక్కువ అని గ్రహించటానికి ఎంతో కాలం పట్టదు.

అందుకే పాఠకులకు ఆమె రచనలంటే వెగటు పుట్ట సాగినయ్.

"మంగతాయారు కథా? ఆమె ఏం వ్రాసిందో చదవ

కుండానే ఊహించుకోవచ్చు" అంటూ పాఠకులు ఆ పేజీ తిప్పి వేసే స్థితికి వచ్చేరు.

తనలోని ప్రత్యేకతతో కీర్తి శిఖరాల నందుకోవాలని చిన్ననాటి నుండి కలలుగన్న మంగతాయారు అపసరాన్ని మించిన అతిశయం, అర్థంలోని ఆవేశం తన నెందుకిలా అధోలోకాలలోకి తోసివేసినాయో అర్థం చేసుకోలేక తికమక పడిపోయింది.

—